క్లుప్తంగా

ఆటోను ఢీ కొట్టిన ట్రాక్టర్

తొమ్మిది మంది కూలీలకు గాయాలు

ముసునూరు: అతి వేగం, నిర్లక్ష్యం కారణంగా తొమ్మిది మంది గాయాలపాలయ్యారు. మండల కేంద్రం ముసునూరు సినిమా హాల్ సెంటర్‌లో కూలీలతో వెళుతున్న ఆటోను గురువారం సాయంత్రం ట్రాక్టర్ వేగంగా వచ్చి, బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను 108 వాహనంలో నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తొమ్మిది మంది గాయాలపాలవగా, వారిలో ఆటో డ్రైవర్‌తో సహా నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్సానంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు స్టేషన్‌కు ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్యానర్ల ఏర్పాటు నిషేధం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 65, 30వ నంబర్ల జాతీయ రహదారులు, ప్రధాన కూడళ్ల వద్ద బ్యానర్లు ఏర్పాటు నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. బ్యానర్లు వాహనదారులకు ఇబ్బంది కలిగించడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ముందస్తు అనుమతి లేకుండా బ్యానర్లు కడితే ఎటువంటి నోటీసు లేకుండా తొలగించడంతో పాటు చట్టపరమైన చర్యల్లో భాగంగా అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు.

కోనేరు నిర్మాణానికి భూమి పూజ



నెమలి(గంపలగూడెం): జిల్లాలో విశిష్ట ఆలయమైన నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కోనేరు నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తిరునగరి గోపాల చార్యులు అర్చక బృందంచే విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ శ్రీరామ వర ప్రసాదరావులు పనులను ప్రారంభించారు. పాలకవర్గ సభ్యులు వెంకటకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కైలాస గౌరీ నోము

గంపలగూడెం: కైలాస గౌరీ నోమును గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. గంపలగూడెం శివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కేతేపల్లి శ్యామలాదేవి, ప్రశాంతి, తటపర్తి గీతా లావణ్య, కంభంపాటి మాధవిలు, చారుగుండ్ల పెద్ద హనుమంతరావు ఇంటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో చారుగుండ్ల రాధికలు కైలాస గౌరీ నోములు నోచుకున్నారు. గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఎల్‌బీఆర్‌సీఈ స్టూడెంట్ చాప్టర్ ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గత పది రోజులుగా నిర్వహిస్తున్న వెబ్ డెవలప్‌మెంట్(బ్యాంకేడ్ టెక్నాలజీస్), ఐటీ వర్క్‌షాపు(పవర్ ఆఫ్ ప్రోగ్రామింగ్ ఫర్ సాల్వింగ్ రియల్ వరల్డ్ ప్రాబ్లమ్స్) గురువారం ముగిసింది. ఐటీ విభాగాధిపతి డాక్టర్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21న మండల పరిషత్ సమావేశం

తిరువూరు: తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ గద్దల భారతి అధ్యక్షతన జరిగే సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనాలని కోరారు.

23న విస్సన్నపేట మండల సమావేశం

విస్సన్నపేట: వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ గురువారం తెలిపారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

22న వాహనాల వేలం

మైలవరం: మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, గంపలగూడెం పోలీస్ స్టేషన్లలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 46 వాహనాల బహిరంగ వేలం ఈ నెల 22వ తేదీన నిర్వహిస్తామని స్టేషన్ హౌస్ ఆఫీసర్ గిరిజ సత్య కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మైలవరం పీఎస్‌లో వేలం నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు ఆయా పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని కోరారు.

60 మందికి వైద్య పరీక్షలు

ముసునూరు: మండలంలోని అక్కిరెడ్డిగూడెం సచివాలయం సెంటర్ వద్ద గిఫర్డ్ మెమోరియల్ హాస్పిటల్స్(నూజివీడు) ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 60 మందికి ఎముకలు, జనరల్ వైద్య పరీక్షలు చేశారు. మాజీ ఎంపీటీసీ బర్మా సీతారామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా పథకాల పంట

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటా పథకాల పంటేనని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. ముసునూరు మండలం వలసపల్లి ప్రధాన గ్రామంతో పాటు నత్తావారిగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. ఎన్నికల ముందిచ్చిన హామీలన్నీ అమలుచేస్తూ గడప గడపకు వస్తోన్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని చెప్పారు. రానున్న కాలంలో మరిన్ని పథకాలను ప్రజలకు అందిస్తామన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని, అభివృద్ధి చూసి జగనన్నను మళ్లీ, మళ్లీ సీఎంను చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీపీ రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, వైస్ ఎంపీపీ కె.రాజానాయన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు మల్లినేని మురళి, సర్పంచ్ దామోదర్, ఎంపీటీసీ సభ్యురాలు డి.రాటాలు, ఉప సర్పంచ్ డీవీ సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



వలసపల్లిలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

హామీలకు మించి సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే రక్షణనిధి

విస్సన్నపేట: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు మించి ఎన్నో సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని పుట్రేల గ్రామ సచివాలయం -1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేశారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పార్టీలకతీతంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రైతుల సంక్షేమానికి ఆర్బీకేలు ఏర్పాటు చేసి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయటంతో పాటు అనేక పథకాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ కారుమంచి స్వాతి, ఉప సర్పంచ్ మద్దిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నేతలు భీమిరెడ్డి పట్టాభిరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ భూక్యా రాణి, ఎంపీటీసీ సభ్యులు గార్లపాటి నాగేశ్వరరావు, చాట్ల మణి, భీమిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, అనుమోలు శివబాజీ, ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, ఎంఈఓ చదల రామకృష్ణ, డీటీ మోతీయా, ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, ఏపీఎం జమలయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాఘవి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

సమన్వయంతో బ్రహ్మోత్సవాలు నిర్వహించాలి

తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మార్చి 5 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలను సమన్వయంతో నిర్వహించాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి అధికారులను ఆదేశించారు. తిరువూరు ఆర్డీఓ కార్యాలయంలో గురువారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం, కృష్ణా జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వాహనాల పార్కింగ్, ప్రసాదాల పంపిణీ, కల్యాణం తిలకించేందుకు అవసరమైన ప్రాంగణంలో ఏర్పాట్లు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు సిబ్బందిని నియమించాలని, ఆర్టీసీ బస్సులను అవసరమైన మేరకు ప్రత్యేక సర్వీసులుగా నడపాలని సూచించారు. నెమలి వేణుగోపాలస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, ఆలయ సహాయ కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు, గంపలగూడెం ఎస్‌ఐ సతీష్, ఈఓపీఆర్‌డీ బాబూరావు, ఫైర్, విద్యుత్, ఆర్టీసీ, పంచాయతీరాజ్ అధికారులు హాజరయ్యారు.



తిరువూరులో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

ఎంపీపీ పాఠశాలను సందర్శించిన నైజీరియా బృందం

ఇబ్రహీంపట్నం: తుమ్మలపాలెం ఎంపీపీ పాఠశాలను నైజీరియా బృందం గురువారం సందర్శించింది. ప్రథమ్ సంస్థ ద్వారా వివిధ దేశాలతో పాటు ఏపీలో అమలవుతున్న టీచింగ్ ఎట్ రైట్ లెవల్(టార్ల్) తీరును పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన విధాన, విద్యా విధానంపై విద్యార్థులను ప్రశ్నించారు. టార్ల్ సంస్థ అమలు చేస్తున్న విద్యా విధానం వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉందని ప్రశంసించారు. ఎంఈఓ పుష్పలత, టార్ల్ జోనల్, జిల్లా కో ఆర్డినేటర్లు జాన్‌విల్సన్, నాగుల్ బీ, ప్రథమ్ సంస్థ సెంట్రల్ టీమ్ సభ్యులు హరి, మంజునాథ్, సుధాకర్, హెచ్‌ఎం శివలీల పాల్గొన్నారు.



తుమ్మలపాలెంలో విద్యార్థుల విద్యా విధానం పరిశీలిస్తున్న నైజీరియా బృందం

బత్తుల వీరమ్మ సేవలు చిరస్మరణీయం

నూజివీడు: సంఘ సేవకురాలిగా, అంబేడ్కర్ వాదిగా బత్తుల వీరమ్మ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. బత్తుల వీరమ్మ సంస్మరణ సభను గురువారం గాంధీనగర్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ వీరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరమ్మ లేనిలోటు తీర్చలేనిదన్నారు. నాయకులు పిళ్లా చరణ్, పల్లె రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.



రెడ్డిగూడెం ఎస్‌ఐపై విచారణకు మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశం

మైలవరం: రెడ్డిగూడెం ఎస్‌ఐ ఆనంద్‌కుమార్‌పై విచారణ చేపట్టి రిపోర్టును సమర్పించాలని మైలవరం సీఐ ఎల్.రమేష్‌ను మైలవరం ఫస్ట్ క్లాస్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం ఆదేశించింది. రెడ్డిగూడెం మండలంలోని సీతారామపురం గ్రామంలో నివాసముంటున్న నీలిమ, జనార్దన్ దంపతుల చిన్న కుమారుడు పృథ్వీ అదే గ్రామానికి చెందిన ప్రత్యూషను గత నెల 29న ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రత్యూష కుటుంబ సభ్యులకు ఈ వివాహం ఇష్టం లేదు. ఈ మేరకు ఆమె తల్లిదండ్రులు రెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం ఎస్‌ఐ ఆనందకుమార్ పృథ్వీ తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, అనుచితంగా ప్రవర్తించాడు. అసభ్య పదజాలంతో దూషించడమే గాక వారి కోసం స్టేషన్‌కు వచ్చిన పెద్ద కుమారుడు భవానీని కొట్టారన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తమను స్టేషన్‌లో నిలబెట్టారని బాధితులు ఈ నెల 15న ప్రైవేట్ కేసు పెట్టడంతో 16న మైలవరం కోర్టుకు కేసు విచారణకు వచ్చింది. దీనిపై స్పందించిన మేజిస్ట్రేట్ విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు. ఫిర్యాది తరపున న్యాయవాది శ్రీనివాసరావు వాదనలు వినిపించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

మునుకుళ్ల(తిరువూరు): రైతులు తమ పొలాల్లోని మట్టి నమూనాలకు భూసార పరీక్షలు చేయించాలని రైతు శిక్షణా కేంద్ర ఉపసంచాలకులు మాధవీలత సూచించారు. మునుకుళ్లలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటలకు మిత్ర, శత్రు పురుగుల వలన కలిగే ఫలితాలు, ఎరువులు, నీటియాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా రైతు శిక్షణా కేంద్ర శాస్త్రవేత్త రాజశేఖర్, తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడీ, అధికారులు మోనీషా, పద్మ ఉన్నారు.

ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ



ఇబ్రహీంపట్నం: మండలంలో జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ గ్రామసభ గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ రామకృష్ణనాయక్ అధ్యక్షతన జరిగిన సభలో డ్వామా పీడీ జె.సునీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై ఆడిట్ నివేదిక చదివి వినిపించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.3,26,55,260, పంచాయతీరాజ్ రూ.5,06,81,150, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ రూ.1,29,99,684, మొత్తం రూ.9,67,87,352 ఖర్చు చేశారు. కూలీల హాజరు, కంప్యూటర్ తేడాలు, మొక్కల రీ ప్లేస్‌మెంట్‌లో రూ.17వేలు రికవరీ చేశారు. ఎంపీపీ పి.జ్యోత్స్న, ఏపీడీ పద్మ, డీపీఓ విజయలక్ష్మి, ఏపీఓలు మాధవరెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ అరికట్టేందుకు సహకరించండి

నూజివీడు: వ్యవసాయ బోర్లకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీని నియంత్రించేందుకు రైతుల సహకారం కూడా అవసరమని ఏపీసీపీడీసీఎల్ విజిలెన్స్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని జంగంగూడెంలో గురువారం రాత్రి విద్యుత్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. విజిలెన్స్ సీఐ గంగాభవాని ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో డీఈఈ ఓలేటి దుర్గారావు, మీర్జాపురం ఏఈ బాబూరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండరామస్వామి పట్టాభిషేకం



తిరువూరు: తిరువూరులో పునర్నిర్మించిన శ్రీకోదండరామస్వామి దేవాలయంలో గురువారం శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు దివి ఉదయ కుమారాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు, సీతారామ పట్టాభిషేకం, శాంతికల్యాణం జరిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు సత్యనారాయణరావు, సుబ్బారావు పర్యవేక్షించారు.

నేడు వికాస్‌లో ప్రాంగణ ఎంపికలు

విస్సన్నపేట: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బహుళజాతి ఔషధ సంస్థ హెటిరో లాబ్స్ ఆధ్వర్యంలో స్థానిక వికాస్ పీజీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వికాస్ కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి గురువారం తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలకు ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, బి ఫార్మసీ పూర్తి చేసిన, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు.

మామిడి తోటలో సూక్ష్మ ధాతువు లోపం

చాట్రాయి: మామిడి తోటల్లో సూక్ష్మ ధాతువు లోపం ఏర్పడిందని ఉద్యానవన శాఖాధికారి హేమ పేర్కొన్నారు. చాట్రాయి మండలం చిత్తపూరు, ఆరుగొలనుపేట, బూరుగుగూడెం, నరసింహారావుపాలెం గ్రామాల్లో మిరప, మామిడి తోటలను గురువారం ఆమె పరిశీలించారు. సూక్ష్మ ధాతువు నివారణకు ఫార్ములా 4ని పిచికారీ చేయాలని, మిరపలో నల్ల తామర పురుగుకు పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలన్నారు. మూడు మిల్లీ లీటర్ల 10,000 పీపీఎం ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

కేడీసీసీబీ సేవలపై ప్రచార జాతా

మూలపాడు(ఇబ్రహీంపట్నం): కేడీసీసీ బ్యాంక్ సేవలపై చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ఆదేశాలతో మూలపాడు పీఏసీఎస్ వద్ద కళాజాత ప్రదర్శన గురువారం జరిగింది. కళాభారతి బిళ్లపాడు కళాకారులు వ్యవసాయ రుణాలు, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, సురక్ష బీమా యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలు, రుణసౌకర్యం పథకాలపై పాటలు, నాటికల రూపంలో అవగాహన కల్పించారు. బ్యాంక్ మేనేజర్ జాహ్నవి, సూపర్‌వైజర్ సుబ్బారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొర్నేని గాంధీ, కార్యదర్శి మాధవరావు, కళాకారులు శేఖర్‌బాబు, తిరుపతికుమార్, రమేష్, బీరయ్య పాల్గొన్నారు.

పైపులైన్ పనుల ప్రారంభం



చాట్రాయి: మండలంలోని నర్సింహారావుపాలెం గ్రామంలో తాగునీటి సరఫరా చేసేందుకు రూ.35 లక్షలతో పైపులైన్ పనులను గ్రామ సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి గురువారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మందపాలటి వెంకటరెడ్డి, నాయకులు విస్సంపలి సీతయ్య, కేశవరెడ్డి పాల్గొన్నారు.

బలివే మహోత్సవాలకు సర్వం సిద్ధం



బలివే(ముసునూరు): దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన బలివేలోని మహా శివరాత్రి ఉత్సవాలను సర్వం సిద్ధం చేశారు. ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షుడు నాగుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ప్రత్యేకాధికారి ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆలయ ఈఓ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు ఉత్సవాల ఆరంభాన్ని ప్రకటించారు. ఉత్సవాల ప్రత్యేకాధికారి నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ గౌడ్ ప్రత్యేక పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ, ఉత్సవ ప్రాంగణాల్లో క్యూలైన్లు బారికేడ్లు, మహిళల కోసం మరుగుదొడ్లు, జల్లు స్నానాలు, ఉచిత మంచినీరు, వైద్య శిబిరాలు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నూజివీడు, ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం అర్ధరాత్రి నుండే ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు నడుపుతున్నారు. అన్ని శాఖల సమన్వయంతో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఉత్సవ ప్రాంగణంలో వినోదానికి ఏర్పాటు చేశారు. పలు సేవా సంస్థలు, పలువురు దాతల ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన శిబిరాలు, పులిహోరా, మజ్జిగ, మంచినీరు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- మండల సమావేశంలో ఎమ్మెల్యే రక్షణనిధి
- హైస్కూల్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశం

గంపలగూడెం: మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రక్షణనిధి అధికారులను ఆదేశించారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన 2023–24 బడ్జెట్ ఆమోదం కోసం గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. విద్యను ప్రోత్సహించేందుకు దాతలు వితరణగా ఇచ్చిన నెమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థలాన్ని వెంటనే స్వాధీన పరుచుకోవాలని తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిని ఆదేశించారు. హైస్కూల్ స్థలం విషయంపై స్పందనలో జిల్లా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేర ఇప్పటికే రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారన్నారు. పూర్తి స్థలం హద్దుల ప్రకారం స్వాధీనం చేసుకోవాలన్నారు. అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలవగ్గాల్సిన పని లేదని చెప్పారు.



గంపలగూడెం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

అభివృద్ధిపై శాఖల వారీ చర్చ

ఎంఈఓ సోమశేఖర్‌నాయక్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి నాగభద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి నాయక్ వారి శాఖల అభివృద్ధిపై సమావేశంలో వివరించారు. కొణిజెర్లలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అవసరమైన భూమిని స్వాధీన పరుచుకున్న నేపథ్యంలో అక్కడ ఆక్రమణలో ఉన్న ఆరుగురికి ప్రత్యామ్నాయ స్థలం చూపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. బడ్జెట్‌ను ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. జెడ్పీటీసీ సభ్యుడు కె.శామ్యూల్ పలువురు అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలందించాలి

విజయవాడరూరల్: గ్రామ సచివాలయాల్లో ప్రజలకు నాణ్యమైన సేవలందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె.అనురాధ తెలిపారు. డీఎల్‌డీఓ జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి గ్రామ సచివాలయాలను గురువారం సందర్శించి సచివాలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వారానికి ఒక రోజు నాడు–నేడు పనులకు సంబంధించిన రిపోర్టును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, అడంగల్ నకలు, విద్యుత్ బిల్లుల చెల్లింపు వంటి మీ సేవా కేంద్రాల్లో కాకుండా సచివాలయాల్లోనే అందజేస్తామన్నారు. మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించాలని, ఆరోగ్యశ్రీ కార్డులతో పాటు ఆయుష్మాన్ భారత్‌లో కూడా వైద్య సేవలందుతాయనే వివరాలను ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టార్గెట్‌లను పూర్తి చేసి యాప్‌లలో వివరాలు నమోదు చేయాలన్నారు. రిజిష్టర్లను డీఎల్‌డీఓకు పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు టి.భారతి, పి.మురళీమోహనరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



జక్కంపూడి సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ అనురాధ

వెల్వడంలో ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

వెల్వడం(మైలవరం): మహాశివరాత్రి సందర్భంగా మైలవరం మండలం వెల్వడం గ్రామంలోని శివాలయం ప్రాంగణం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీసీపీ మేరీప్రశాంతి తెలిపారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలోని శివాలయం ప్రాంతాన్ని సీపీ టీకే రాణాతో పాటు డీసీపీ మేరీ ప్రశాంతి గురువారం సందర్శించారు. సీపీ స్వయంగా వివరాలు తెలుసుకున్నారు. డీసీపీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ వేడుకలకు పెద్ద సంఖ్యలో బలగాలను ఏర్పాటు చేశామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఫైర్ ఇంజన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో మైలవరం ఏసీపీ ఎం.రమేష్, సీఐ ఎల్.రమేష్, ఎస్‌ఐ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.



వెల్వడంలో డీసీపీ మేరీ ప్రశాంతి, అధికారులతో చర్చిస్తున్న సీపీ టీకే రాణా

మహా శివరాత్రికి ఆలయాల ముస్తాబు

గంపలగూడెం: మహా శివరాత్రి పర్వదినోత్సం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేందుకు మండలంలోని పలు గ్రామాల్లో వివిధ శివాలయాలను సిద్ధం చేశారు. మేడూరు జీవన్ముక్తేశ్వర స్వామి ఆలయం, భ్రమరాంబ సహిత రామలింగేశ్వరస్వామి ఆలయం, గంపలగూడెం గంగ, పార్వతి, భ్రమరాంబ, బాల త్రిపుర సుందరీ దేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, పెనుగొలను రామలింగేశ్వర స్వామి ఆలయం, కొత్తపల్లి ఉమా గౌరీశంకర దేవాలయం, గోసవీడు విశ్వేశ్వర స్వామి ఆలయం, నెమలి శివాలయాల్లో పరమ శివునికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామన్నారు. స్వామి వారికి అభిషేకాలు, తైలాభిషేకాలు నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు. కొత్తపల్లి శివారు కట్టలేరు నందు గోపాలస్వామి మడుగులో పుణ్య స్నానాలు ఆచరించేందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆగిరిపల్లి: శివరాత్రి పర్వదినానికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. స్థానిక సత్రం సెంటర్‌లోని గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి శివాలయాన్ని దేవదాయశాఖ ఆధ్వర్యంలో సిద్ధం చేసి, భక్తుల దర్శనార్థం ఏర్పాట్లు చేశారు. కనసానపల్లిలో చంద్రమౌళీశ్వరస్వామి, సూరవరం ముక్తేశ్వరస్వామి, ఈదులగూడెం నాగేంద్రస్వామి, ఆగిరిపల్లి శోభనాచలుని ఎగువ కొండపై స్వయంభు దుర్గాపార్వతి సమేత మల్లికార్జునస్వామి ఆలయాలను ముస్తాబు చేశారు.

చాట్రాయి: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. చాట్రాయి ఉమా రామ లింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే శివరాత్రి వేడుకలకు తెలంగాణ సరిహద్దు మండలాలతో పాటు చాట్రాయి మండల ప్రజలు పాల్గొంటారు. ఈ ఆలయం ఎదురుగా ఉన్న పెద్ద చెరువులో స్నానాలు చేసి పిండప్రదానాలు చేస్తారు. సి.గుడిపాడు శివాలయంలో కూడా భక్తులు వేలాదిగా తరలివస్తారు.

తిరువూరు: శివరాత్రి వేడుకలకు దేవాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవదాయ శాఖ మేనేజరు జన్ను వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయాలలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణంతో పాటు బస్టాండు సెంటర్లో అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఖమ్మం జిల్లాలోని నీలాద్రి, గుట్టపాడు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సుసర్వీసులు నిర్వహిస్తున్నట్లు డీఎం వేణు తెలిపారు.



మేడూరు రామలింగేశ్వర స్వామి ఆలయం



సత్రం శివాలయం

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

ఇబ్రహీంపట్నం: ఈనెల 18న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ సుబ్రహ్మణ్యం తెలిపారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి కొండపల్లి, జి.కొండూరు, మైలవరం, విజయవాడ ప్రాంతాల నుంచి ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్దకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు.

నూజివీడు: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నూజివీడుతో పాటు పలు గ్రామాల నుంచి ముసునూరు మండలం బలివేకు రెండు ఉచిత బస్సులను ఏర్పాటు చేసినట్లు స్థానిక పారిశ్రామికవేత్త మూల్పూరి లక్ష్మణస్వామి తెలిపారు. ఉదయం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు బస్సులు నడుస్తాయన్నారు.